

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం, కేపీ పాలెం గ్రామాలలో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కి ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.



సాగరతీరంలో పర్యాటకులు

కూలి డబ్బులు ఇవ్వండి మహాప్రభో..!

ఉపాధి హామీ శ్రామికులకు సొమ్ములు అందని పరిస్థితి

ఏడు వారాలకు పైగా బకాయిలందక విలవిల

రెండు జిల్లాల్లో రూ. వంద కోట్లు పైనే కూలి సొమ్ములు పెండింగ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పేదల పాట్లు వర్ణనాతీతం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి హామీలో పని చేసిన శ్రామికులకు కూలి డబ్బులు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి రోజూ రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు సకాలంలో కూలి డబ్బులు అందక ఆర్థికంగా నలిగిపోతున్నాయి. ఏడు వారాలకుపైగా సొమ్ములు అందకపోవడంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలి సొమ్ములు ఇవ్వకపోతే ఇల్లు ఎలా గడపాలంటూ శ్రామికులు ప్రశ్నిస్తున్న పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు ఎప్పటికప్పుడు డ్వామా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నా సొమ్ములు విడుదలలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. జూన్ మొదటి వారంలో కేంద్రం నుంచి రూ.550 కోట్ల వరకూ విడుదలయ్యాయని, అందరికీ సొమ్ములు జమవుతాయని తెలిపారు. రెండు వారాల సొమ్ము మాత్రమే జమైన పరిస్థితి నెలకొంది. కేంద్రం నిధులు విడుదల చేస్తే రాష్ట్రం ఇవ్వలేదా.. లేక కేంద్రమే విడుదల చేయలేదా అనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. ఏలూరు జిల్లాలో 4.85 లక్షల వరకూ జాబ్‌కార్డ్ దారులు పనిచేస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ 55 లక్షల వరకూ పని దినాలు చూపారు. తర్వాత గడిచిన 37 రోజులుగా ఉపాధి శ్రామికులు పనిచేస్తూనే ఉన్నారు. జూన్ ఒకటోతేదీకి ఉపాధి శ్రామికులకు వేతనాల కింద రూ.124 కోట్ల వరకూ రావాల్సి ఉంది. పశ్చిమలో జూన్ ఒకటో తేదీకి 16 లక్షల పని దినాలు కల్పించగా రూ.45 కోట్ల వరకూ ఉపాధి శ్రామికులకు కూలి సొమ్ములు అందాల్సి ఉంది. అక్కడ సైతం ఈ కాలంలో పనులు చేస్తూనే ఉన్నారు. ఏప్రిల్ నుంచి జులై మొదటి వారం వరకూ పనిచేసిన రోజుల్లో కేవలం రెండు వారాల సొమ్ములు మాత్రమే జమైనట్లు ఉపాధి శ్రామికులు చెబుతున్నారు. ఆ ప్రకారం చూస్తే ఇంకా రెండు జిల్లాల్లో ఉపాధి కూలి సొమ్ములు రూ.వంద కోట్లకుపైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. కూలి సొమ్ములు ఎప్పటికిస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూలి సొమ్ముల కోసం ఉపాధి శ్రామికులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన సమాధానం లేకుండా పోయింది.

ఇల్లు గడిచేదెలా..

నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంట నూనె ప్యాకెట్ సైతం రూ.150 పైనే పలుకుతోంది. పప్పుల ధరలు కిలో రూ.వందకుపైగానే ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజానీకం బతుకు కష్టతరంగా మారింది. ఉపాధి హామీలో జాబ్‌కార్డులున్న శ్రామికుల్లో అత్యధికం కూలి సొమ్ములతోనే జీవనం సాగించే పరిస్థితి ఉంది. వారం సొమ్ములు అందింతే ఇంట్లోకి కావాల్సిన సరుకులు తెచ్చుకుంటారు. కూలి సొమ్ములు నెలల తరబడి పెండింగ్ పెడితే ఏవిధంగా బతకాలంటూ ఉపాధి శ్రామికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇలా అయితే పని చేయడం ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో అండగా ఉండడానికి ఉపాధి హామీ చట్టం తెచ్చారు. పనులు లేని రోజుల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నారు. అటువంటప్పుడు చేసిన పనికి సొమ్ములు ఇవ్వకపోతే ఆయా కుటుంబాలు ఏవిధంగా బతకాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాల్సి ఉంది. ఉపాధి హామీ కూలి సొమ్ములు వెంటనే విడుదల చేయాలని ఉపాధి శ్రామికులంతా కోరుతున్నారు. నిధులు కేంద్రం ఇచ్చిందా.. లేదా అనేది రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. ఒకవేళ కేంద్రం నుంచి నిధులు వస్తే రాష్ట్రం ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. పాలకులు మారుతున్నా ఉపాధి శ్రామికుల బతుకులు మాత్రం మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

10న పండుగలా మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పండుగలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒలు, జిల్లా విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అటవీ శాఖ అధికారి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖల అధికారులు, ప్రయివేటు పాఠశాలల, జూనియర్ కళాశాలల అసోసియేషన్స్ ప్రతినిధులతో సమీక్షించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లూ చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, మెంబర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాలల పూర్వ విద్యార్థులు, ప్రముఖులను ఆహ్వానించి వారందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా కొత్త స్కూల్ యూనిఫామ్ ధరించి విధిగా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. ఏర్పాట్లపై సంబంధిత ఫొటోలు, వీడియోలు ఈ నెల 8 తేదీ నుండి సంబంధిత వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలు, కళాశాలల వద్ద అవసరం మేరకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిఎంఅండ్‌హెచ్‌ఒను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 8816299181 ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోతే సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయెుచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా ఉదయం ఉదయం 10 గంటల నుండి మధ్యాహం 1:30 నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెరుగుతున్న గోదావరి

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి క్రమం క్రమంగా పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నదీ తీర ప్రాంతాల ప్రజల్లో కలవరం మొదలైంది. గత కొన్ని రోజులుగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలు తోడయ్యాయి. దీంతో గోదావరి క్రమం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జల వనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గతేడాది జులై నెలలో ఉధృతంగా గోదావరికి వరదనీరు చేరడంతో ఏటిగట్ల పటిష్టతపై అనేక సందేశాలు వ్యక్తమయ్యాయి. సమస్యను పరిష్కరిస్తామంటూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీ నేతి బీరకాయ చందంగా మారిన విషయం విదితమే. తాజా ప్రభుత్వం కూడా ఏడాది కాలయాపన చేసిన ఏటిగట్ల పరిరక్షణకు చర్యలు లేకపోవడంతో చిత్తశుద్ధికి లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో జిల్లాలో ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, అయోధ్యలంక, పి పచ్చలంక మర్రిమూల, రాయిలంక, పెదమల్లంలంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టి ప్రజలకు భరోసా కల్పించాలని లంక గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు. ప్రస్తుతానికి లంక గ్రామాల్లో ప్రజలు యధావిధిగా రాకపోకలు కొనసాగిస్తున్నారు.



కోడేరు వద్ద పెరుగుతున్న వశిష్ట గోదావరి

ఎరువుల కోత నివారించాలి

రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎరువుల కోత నివారించి యధాతథంగా రైతులకు ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లక్షల టన్నుల ఎరువులను కోత విధించాలని నిర్ణయానికి కూటమి ప్రభుత్వం అంగీకరించడం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడమే అని వారు తెలిపారు. ఇప్పటివరకు కాంప్లెక్స్ యూరియా ఎరువులు వాడకం వల్ల వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని, ఎకరం 60, 70 బస్తాల వరకు రైతు పండిస్తున్నాడని, కానీ కేంద్ర ప్రభుత్వం ఎరువుల మీద రూ.15 వేల కోట్ల సబ్సిడీ ఇస్తున్నానని, ఆ సబ్సిడీని ఎగ్గొట్టడానికి నానో యూరియా, నానో డిఎపి రసాయనాలను బలవంతంగా రైతులకు రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఆ రసాయనాలను వాడి రైతులకు ప్రయోజనం లేక వాటిని రైతులు విరమించుకున్నారని అటువంటి పరిస్థితుల్లో తిరిగి మరలా బలవంతంగా వాటిని ప్రవేశపెట్టడం సరైనది కాదన్నారు. ఇప్పటివరకు శాస్త్ర పరిశోధన రంగాలలో అవి విజయవంతం కాలేదని, అలాంటి వాటిని తీసుకుని వచ్చి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మీద రుద్దడం సరైంది కాదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో పడుతుందని, ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం ఏదో సబ్సిడీ వస్తుందని, రాష్ట్రానికి ఉపయోగించుకోవచ్చు అని భ్రమపడుతుంది తప్ప వ్యవసాయ రంగంలో వచ్చే ఇబ్బందులు, రైతాంగం గురించి ఆలోచించట్లేదని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చెప్పిన ప్రతి విషయాన్ని అంగీకరించకుండా రాష్ట్రంలోని రైతులకు, ప్రజలకు అనుకూలమైన విధానాలను అవలంబించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతాంగ వ్యతిరేక విషయాలలో కూటమి ప్రభుత్వం అనుకూలంగా లేనట్లయితే రైతాంగం, ప్రజలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు దిగుతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, ఆడప ఆంజనేయులు, గాది వెంకటరావు, ఎస్‌విఎస్.రెడ్డి, మద్దాల పుత్రయ్య, బుద్దాల నాని, ఆకుల నారాయణ, కృష్ణ, జి.నాగబాబు, సత్తి దుర్గారెడ్డి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

గురుకుల పాఠశాల తరలింపుపై ఎస్ఎఫ్ఐ నిరసన

పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని గురుకుల పాఠశాలను ఉన్నత అధికారుల అనుమతి లేకుండా పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వర్ యలమంచిలి మండలం కట్టుపాలెంకు తరలించడంపై ఎస్ఎఫ్ఐ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ నాయకులు ఆదివారం కట్టుపాలెం వెళ్లారు. అక్కడ పాఠశాలను, పరిస్థితులను పరిశీలించగా అగమ్యగోచరంగా ఉన్నాయని తెలిపారు. పట్టణ కమిటీ పరిస్థితి గురించి ప్రశ్నించగా పాఠశాల ప్రిన్సిపల్ ఏమీ పట్టనట్టు వ్యవహరించారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులకు కనీస మౌలిక అవసరాలు కూడా లేవని ప్రిన్సిపల్‌ను ప్రశ్నించగా సమాధానం ఇవ్వకపోగా సమస్యలు చెప్పడానికి వచ్చిన విద్యార్థులకు టిసిలు ఇచ్చి బయటకు పంపిస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. చట్టానికి విరుద్ధంగా పాఠశాల బదిలీ అయినప్పుడు విద్యార్థులతో వెట్టి చాకిరీ పనులు చేయించారని, విద్యార్థుల దగ్గర నుంచి లంచం కూడా అడిగి తీసుకున్నారని తెలిపారు. వర్షం వస్తే స్లాబ్ నుంచి ఊడిపడే పెచ్చులు చూసి ఆ విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. జిల్లా ఉన్నత విద్యాశాఖాధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, నవీన్, తేజ, పట్టణ కమిటీ సభ్యులు తారక్, శంకర్, లోకేష్, ఆకాష్, భారత్, నాని, చందు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

లేబర్ కోడ్‌ల రద్దుకే..

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి


ప్రజాశక్తి - ఉండి

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల తొమ్మిదో తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. ఉండి ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న మంతెన సీతారాం మాట్లాడుతూ మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. పేదవాడిపై పన్నుల భారాలు మోపి కార్పొరేట్లకు సుమారు రూ.14 లక్షల కోట్ల రుణమాఫీ చేయడం దుర్మార్గమన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ఆంధ్ర ప్రజలను మోసం చేశారని అన్నారు. కేవలం ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద ఉందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా 9న ప్రజాసంఘాలు చేసే దేశవ్యాప్త సమ్మెలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనికొండ శ్రీనివాస్, వీరవల్లి మాధవరావు, వీరవల్లి శ్రీనివాస్, కిలారి తవిటినాయుడు, కొల్లి రత్నకుమారి, కడలి నాగేశ్వరరావు, కట్టా రవి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: 9న అఖిల భారత సమ్మెకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ పూర్తి మద్దతిస్తుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కుమార్ తెలిపారు. ఆదివారం భీమవరం శాఖ జరిపిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కుమార్ మాట్లాడుతూ అఖిల భారత కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్, అఖిల భారత ఫెడరేషన్ అయిన ఎఫ్ఎంఆర్ఎఐ, దాని రాష్ట్ర శాఖ అయిన ఎపిఎంఎస్ఆర్‌యు పిలుపు మేరకు 9న అఖిలభారత సమ్మెలో పాల్గొంటున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కేంద్ర క్యాబినెట్లో ఆమోదించిన 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చటం జరిగిందని తెలిపారు. ఈ పరిణామం మూలంగా కార్మికులకు, ఉద్యోగులకు ఎంతో చట్టపరంగా ఆసరాగా ఉన్న హక్కులను మార్పు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియజేశారు. పోరాడి సాధించుకున్న 29 చట్టాలను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతనం రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు కెఎం.సూర్య చంద్రరాజు మాట్లాడారు. సమావేశంలో భీమవరం శాఖ అధ్యక్షులు పి.రమేష్ బాబు, కార్యదర్శి ఎన్.రమేష్, జి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నరసాపురం: నూతన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. స్థానిక మీరా గ్రంథాలయంలో బజారు జట్ల కార్మిక సంఘం సమావేశం పొన్నాడ మల్లేష్, కోరాడ బద్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ కార్మికులకు రక్షణగా ఉన్న 40 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికవర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే ఎనిమిది గంటల పనివిధానం, పనికి తగ్గ వేతన విధానం, కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసుకునే హక్కు కోల్పోతారన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బజారు జట్టు కార్మికులు రాడా జగన్, సందక దుర్గారావు, మల్నీడి సురేష్, నాగరాజు, గుబ్బల సత్యనారాయణ, రాము, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉండి : మాట్లాడుతున్న మంతెన సీతారాం



తణుకు : ప్రభుత్వాలు పెంచిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఈనెల 9వ తేదిన జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి కార్మికవర్గానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం తణుకు పట్టణంలో ఉన్న అన్ని పరిశ్రమలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ప్రతాప్, గోపిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు కాకుంటే కార్మికుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు ఇప్పటి వరకు ఉన్న అన్ని హక్కులు పోతాయని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు వీరనారాయణ థియేటర్ వద్ద నుంచి జరిగే బైక్ ర్యాలీలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, సిహెచ్.రామకృష్ణ, లక్ష్మీనారాయణ, గోవిందరాజు, నాగేశ్వరరావు, దక్షిణామూర్తి, గార రంగారావు, శివగణేష్, వైటి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆగస్టులో జాతీయ షార్ట్ ఫిల్మ్ పోటీలు

పాలకొల్లులో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషి : మాజీ మంత్రి జోగయ్య

పాలకొల్లు : పాలకొల్లులో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఏర్పాటు చేసినట్లు మాజీ హోం మంత్రి చేగొండి హరరామ జోగయ్య చెప్పారు. పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిషత్ తరపున తొలిసారి ఆగస్టు నెలాఖారున షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల బహుమతి ప్రధానోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో మొదటి బహుమతిగా రూ.లక్ష, 2, 3 బహుమతులుగా రూ.75 వేలు, రూ.50 వేలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి షార్ట్ ఫిల్మ్‌కు రూ.5 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించారు. సినీ దర్శక నిర్మాతలు, మంత్రి నిమ్మల సహకారంతో పాలకొల్లులో ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. పరిషత్ తరపున జాతీయ స్థాయి నాటిక, నాటక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణికి జీవిత సాఫల్య పురస్కారం ఇస్తున్నట్లు పరిషత్ నూతన అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ చెప్పారు. సినీ దర్శకులు రాజా వన్నెంరెడ్డి, రాజేంద్రకుమార్, సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ, కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ కె.రాంప్రసాద్, గుడాల హరిబాబు, చేగొండి సత్యనారాయణ మూర్తి, బోనం చినబాబు, విన్నకోట వెంకటరమణ, యిమ్మిడి రాజేష్ పాల్గొన్నారు.

తల్లికి వందనం డబ్బులు పడలేదని..

విద్యుత్ టవర్ ఎక్కిన తండ్రి

భీమవరం టౌన్: తన బిడ్డలకు తల్లికి వందనం డబ్బులు పడలేదని మనస్తాపం చెంది ఓ వ్యక్తి శనివారం సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్డు యనమదుర్రు గట్టు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. వివరాలు ఇలా. భీమవరం అరుంధతీ పేటకు చెందిన శ్యామ్ చెప్పులు కుట్టుకుని భార్య, ఇద్దరు పిల్లలను పోషిస్తున్నాడు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం డబ్బులు ఇద్దరి పిల్లలకు పడకపోవడంతో మనస్తాపం చెందిన శ్యామ్ బైపాస్ రోడ్‌లోని హై టెన్షన్ విద్యుత్ పోల్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు ప్రభుత్వం ద్వారా డబ్బులు ఇప్పిస్తామని మైకు ద్వారా చెప్పారు. శ్యాం భార్య, పిల్లలు కూడా డబ్బులు జమ య్యాయని నమ్మబలకడానికి ప్రయత్నించారు. శ్యాం ఎవరి మాటా వినకుండా తనకు కాగితం రాసి ఇవ్వాలని పోలీసులకు సూచించాడు. పోలీసులు కాగితం రాసిన తర్వాత శ్యామ్ కింద దిగాడు. వన్ టౌన్ సిఐ నాగరాజు అతడిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆధిపత్య పోరుకు పాస్టర్ల వాగ్వివాదం

అదుపు చేసిన పోలీసులు

నరసాపురం : పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన లూథరన్ చర్చిలో ఇద్దరు పాస్టర్ల మధ్య ఆధిపత్య పోరు జరిగింది. దీంతో విశ్వాసులు రెండు వర్గాలుగా చీలిపోయి బాహబహికీ దిగారు. దీంతో చర్చి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరికి పట్టణ పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. మొదటి ఆదివారం చర్చిలో పార్థనలు చేసేందుకు పాస్టర్లు చంద్రశేఖర్, నవకుమార్లు పోటీ పడ్డారు. ఇద్దరు పార్థనలు చేసేందుకు రెడీ అవ్వడంతో ఒక వర్గం అడ్డుకుంది. దీంతో పాస్టర్‌లిద్దర్ని సమర్థిస్తూ విశ్వాసకులు కూడా రెండుగా చీలి గొడవకు దిగారు. చివరికి పోలీసులు పెద్ద ఎత్తున చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చర్చిలో పలుమార్లు చోటు చేసుకున్నాయి.

పెరిగిన టమోటా, పచ్చిమిర్చి ధరలు..!

ప్రజాశక్తి - పాలకొల్లు

గత కొన్ని నెలలుగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న టమోటా ధర క్రమేణా పెరుగుతోంది. పక్షం రోజుల క్రితం వరకు కిలో రూ.20 ఉండగా గత వారం రూ.30కు, ఈ వారం రూ.40-50కు పెరిగింది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పచ్చిమిర్చి కూడా గత కొన్ని నెలలుగా కిలో రూ.30-40కు లభ్యం కాగా ప్రస్తుతం కిలో రూ.60-80కు పెరిగింది. గతంలో ఉల్లిపాయల ధరలు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. ఇంతవరకు రూ.100కు 5 కిలోలు ఇవ్వగా ప్రస్తుతం 4 కిలోలు మాత్రం ఇస్తున్నారు. మిగిలిన వంకాయలు, బెండ, దొండకాయ ధరలు కిలో రూ.60-80 మధ్య ఉన్నాయి. గోదావరి వరద పెరగడంతో కాయగూరల ధరలు కూడా క్రమేపీ పెరిగే అవకాశం ఉంది.



యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

13న మెగా జాబ్ మేళా నిర్వహణ : ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ కృషిచేస్తున్నట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. మొదటి ఏడాదిలోనే దాదాపు రూ.9.50 లక్షల కోట్లు పెట్టుబడితో సుమారు 5.50 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తుందని వెల్లడించారు. ఆదివారం తణుకులోని కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో పెట్టుబడులను సాధించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో ఎంతోమంది పారిశ్రామికవేత్తలు భారీ స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావడం విశేషమని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఈనెల 13న తణుకులో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తణుకు మహిళా కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మెగా మేళాలో ముఖ్యంగా ఎలక్ట్రానిక్ ఫార్మా నిర్మాణ ఐటి ఎలక్ట్రానిక్స్ బ్యాంకింగ్ వంటి సుమారు 50కుపైగా కంపెనీలు పాల్గొనబోతున్నాయని తెలిపారు. ఈ మేళాలో పదో తరగతి నుంచి ఇంటర్, ఐటిఐ, డిప్లమా, ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ వంటి అర్హతలు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని ఎంఎల్ఎ వెల్లడించారు. ఇంటర్వ్యూకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న గీత కార్మికులు వేలాదిగా తరలి రండి

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కల్తీ మద్యం, అక్రమ మద్యం అరికట్టకుండా, అక్రమ బెల్టు షాపులు తొలగించకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఉన్నా లేకున్నా ఒకటేనని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం పెనుమంట్ర మండల సొసైటీ ప్రెసిడెంట్ సమావేశం బ్రాహ్మణ చెరువు రైతు సంఘం ఆఫీసులో కడలి బాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయని, ప్రకృతి సిద్ధమైన, ఆరోగ్యకరమైన తాటికల్లు అమ్ముకోవడం లేకుండా ఘోరంగా దెబ్బతీసిందని విమర్శించారు. ఎక్సైజ్ వారికి, ప్రభుత్వానికి తెలియకుండానే కల్తీ మద్యం, అక్రమ మద్యం వరదలా ప్రవహిస్తుందని, ఓట్ల కోసం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు, ఇచ్చిన హామీలు ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు 340 మద్యం షాపులు ఇచ్చేసినట్లుగా ఉదరగొట్టారని, ఎన్నికల అనంతరం గీత కార్మికులను మొండి చెయ్యి చూపటం మాట తప్పడం కాదా అన్నారు. బెల్టు షాపులు తొలగించి కల్లుగీత కులవృత్తులను ఆదుకోవాలని ఈనెల 14వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే ధర్నాకు గీత కార్మికులు వేలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుబ్బల పాటేశ్వరరావు, కంకటాల నాగేశ్వరరావు, బొక్కా కృష్ణ, పౌరు రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హస్నేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ డాక్టర్ నిమ్మగడ్డ ఆదిత్యతదితరులు తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. సంఘ సభ్యులు అతికాల ప్రసాదరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్థి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా అమ్మవార్ల జాతర మహోత్సవాలు నిర్వహించడం మంచి విషయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరం 36వ వార్డు శ్రీమహిమాన్విత మావుళ్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మావుళ్లమ్మ అమ్మవార్ల 12వ జాతర మహోత్సవాన్ని ఆదివారం ప్రారంభించారు. అమ్మవార్ల జాతరలు గ్రామశాంతిని కోరుకుంటాయని, 12 ఏళ్లుగా అమ్మవారి జాతర మహోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందనీయమని ఎంఎల్ఎ అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణమూర్తి, గొర్ల గోపి, ఆలయ కమిటీ సభ్యులు నూకెళ్ల గణేష్, దుర్గారావు, కుమార్, దుర్గప్రకాష్, ప్రసాద్, ప్రకాష్, పండు, పౌలు, వాల్తేన్, ఏసు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడానికి ఆసక్తి

బ్రోచర్ ఆవిష్కరణలో ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - ఆచంట

సమాజంలో చాలామంది వివిధ రూపాల్లో పేదలకు సాయం చేయడానికి ఆసక్తి చూపుతున్నారని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. అమెరికా టంపా సిటీలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా 24వ నాట్స్ మహాసభలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా పి-4 విధానానికి పిలుపునిస్తూ స్టాల్ ఏర్పాటు, క్రీడలు, క్రీడాకారులను దత్తత తీసుకోవాలంటూ శాప్ ఛైర్మన్ రవినాయుడు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 కార్యక్రమాన్ని ఒక మంచి వేదికగా మార్చాలనే ఉద్దేశ్యంతో మార్గదర్శకులుగా ఉండటానికి ముందుకు వచ్చే వారిని సంప్రదించి, వారిని బంగారు కుటుంబాలతో అనుసంధానించే ప్రక్రియపై మరింత శ్రద్ధ పెట్టేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు పితాని ఆదివారం విలేకరులకు తెలిపారు.

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. ఆషాడమాసం కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో సభ్యులు ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

పాండురంగ స్వామి ఆలయంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని వన మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్న సమారాధన చేశారు. ఆషాడ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని సమేత పాండురంగ స్వామికి ఘనంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ విప్ బొమ్మిడి నాయకర్ కల్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మొగల్తూరు : అనారోగ్యానికి గురై సొంత నిధులతో వైద్యం చేయించుకున్న బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నాయకర్ అన్నారు. ఇటీవల మండలంలోని గ్రామాలకు చెందిన 18 మంది అనారోగ్యానికి గురై సొంత నిధులతో వైద్యం చేయించుకున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం వారి ఇంటి వద్దకు వెళ్లి నాయకర్ అందించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ : వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం : మద్యం మత్తులో చెలరేగిన వివాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డి గోవింద(50) పెంటపాడు మండలంలో కూలీ పని చేసుకుంటూ జీవిస్తుంటారు. ఇతనికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం రెలంగిచిత్రం మదిర్ సమీపంలో మద్యం సేవిస్తుండగా కె.మల్లేశ్వరరావు అనే వ్యక్తితో మాటామాటా పెరిగి వివాదంగా మారింది. దీంతో మల్లేశ్వరరావు గోవిందును రాయితో తలపై బలంగా దాడిచేసి, కత్తితో దాడి చేశాడు. దీంతో స్థానికులు తక్షణమే స్పందించి హుటాహుటిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైదులు పరీక్షించి గోవిందు మార్గం మధ్యలోనే చనిపోయినట్లు తెలిపారు. దీనిపై పట్టణ సిఐ ఆది ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు

మున్సిపల్ ఆదాయానికి గండి
పట్టణ ప్రజలు ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాల్లోనూ నగరాలతో పోటీ పడుతున్న భీమవరం పట్టణ ప్రణాళిక విభాగం పట్టణాన్ని నాశనం చేస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణం అభివృద్ధి చెందడంతో ఎటు చూస్తున్నా పెద్ద పెద్ద భవంతులు, అపార్ట్‌మెంట్స్ జోరుగా నిర్మాణం జరుగుతున్నాయి. అయితే ఈ నిర్మాణంలో గ్రౌండ్ ఫ్లోర్‌కి లేక ఒకటి రెండు ఫ్లోర్లకు అనుమతులు తీసుకొని యజమానులు మూడు నుంచి నాలుగు ఫ్లోర్‌లకుపైగా నిర్మాణం చేపడుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్న పట్టించుకోకపోవడానికి అపార్ట్మెంట్ నిర్వాహకులు, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అడ్డగోలు నిర్మాణాలతో ఉక్కుపాదం మోపవలసిన టౌన్ ప్లాన్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్మాణదారులకు వరంగా మారిందని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఎన్నో నిబంధనలు ఉన్నప్పటికీ నిర్మాణదారులకు టౌన్ ప్లాన్ అధికారులు పూర్తి సహకారాలు అందిస్తున్నారు. దీంతో నిబంధనలు తుంగలో తొక్కి నిర్మాణం సాగిస్తున్నారు. పట్టణంలోని ఐదవ వార్డులో ఫ్లైఓవర్‌కు పక్కన నిర్మాణం జరుగుతున్న అపార్ట్‌మెంట్‌కు జి ప్లస్ టుకే అనుమతులు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే జి ప్లస్ త్రీ నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఇదే తరహాలో పలు అపార్ట్‌మెంట్‌లు గ్రౌండ్ ఫ్లోర్‌కు అనుమతి తీసుకుని 3 నుంచి 4 ఫ్లోర్లు నిర్మాణం చేపడతారని, దీనివల్ల మున్సిపాలిటీకి, ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం గండిపడుతుందని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న భవనం

అక్రమ నిర్మాణాలకు పెద్దల సిఫార్సు..

పట్టణంలో నిర్మాణం జరిగే అక్రమ నిర్మాణాలకు కూటమి పార్టీకి చెందిన పెద్దల అండదండలు కూడా ఓ కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలానా చోట అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతుంది, ఏదైనా ఇబ్బందులు ఉంటే చూసి చూడనట్టు వదిలేయాలని కూటమి పార్టీ నాయకులు అధికారులకు హుకుం జారీ చేయడం కూడా దీనికి కారణమని, దీంతో అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుందామన్నా.. తీసుకోలేకపోతున్నారని తెలుస్తుంది. మళ్లీ అదే వంకతో అధికారులు కూడా బాగానే సొమ్ము చేసుకుంటున్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి ఏదేమైనా ప్రభుత్వానికి, మున్సిపాలిటీకి నష్టం వాటిల్లే అక్రమ నిర్మాణాలు ఆపాలని, నిర్మించిన వాటికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎరుకులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

సిపిఎం కాళ్ల మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ

ప్రజాశక్తి - కాళ్ల

ఎరుకుల కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కాళ్లలో ఎపి ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి ఆదివారం నిర్వహించారు. ఏకలవ్య జయంతి సభకు ఎపి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కుతాడి నరసింహమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎరుకుల కులస్తుల హక్కుల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామ టిడిపి అధ్యక్షుడు పెంటపాటి వెంకట నాగేశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ సంఘాల సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య మాట్లాడుతూ ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలన్నారు. దళిత నాయకులు బందా పండు మాట్లాడుతూ ఎరుకుల కులస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సమావేశంలో పలువురు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో బండారు నాని, బండారు సోమేశ్వరరావు, కడలి ప్రదీప్, ఎపి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కుతాడి లావణ్య, నలభ సుభాకర్, గాడ వెంకటేష్, గాడ శంకర్, సాలా శ్రీనుబాబు, గాడ సమూయేలు పాల్గొన్నారు.



కాళ్ల : మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ

ఆచంట : ఏకలవ్యుడు తన గురువును ఆదర్శంగా తీసుకుని తనంతట తానే విలు విద్యను నేర్చుకోవడానికి ప్రయత్నించారని జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెక్రెటరీ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. వల్లూరు గ్రామంలో ఏకలవ్య సంఘ సభ్యులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఏకలవ్య జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో కేక్ కటింగ్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏకలవ్యుడు కుల వివక్షతను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యాన్ని సాధించడానికి పట్టుదలతో ప్రయత్నించారన్నారు. ఏకలవ్యుడు గురువు లేకుండానే ద్రోణుడి విగ్రహాన్ని గురువుగా భావించి నిరంతరం సాధన చేసి విలు విద్యలో నైపుణ్యం సాధించారని కొనియాడారు. తన గురువు పట్ల ఎంతో భక్తి భావాలు కలిగి ఉండేవారన్నారు. గురువు పట్ల ఎనలేని భక్తి ప్రపత్తులను గల ఏకలవ్యుడు తన భవిష్యత్ గురించి ఏమాత్రం ఆలోచించకుండా తన కుడి చేతి బొటన వేలును అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి, జనసేన మండల ఉపాధ్యక్షులు తోట ఆదినారాయణ, సభ్యులు కాపాడి పుల్లయ్య, రమేష్, చిన్న లచ్చన్న, నరసింహారావు, నాగరాజు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిపిఎం నేత దోకల సత్యనారాయణకు మాతృవియోగం

ప్రజాశక్తి - ఆకివీడు

సిపిఎం నాయకులు దోకల సత్యనారాయణకు మాతృవియోగం కలిగింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ తల్లి మహాలక్ష్మి(90) ఆదివారం మధ్యాహ్నం మరణించారు. సత్యనారాయణ చిరకాలం డివైఎఫ్ఐ రాష్ట్ర క్రీడాపోటీల కన్వీనర్‌గా వ్యవహరించారు. ఆయన భార్య దోకల లక్ష్మి గతంలో స్థానిక ఎంపిటిసిగా గెలిచి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలుగా పనిచేశారు. సత్యనారాయణ పెద్ద కుమారుడు డివిఎన్‌విడి.ప్రసాద్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తుండగా చిన్న కుమారుడు దోకల రవికుమార్ స్థానిక సిపిఎం శాఖ కార్యదర్శిగా, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. మహాలక్ష్మి మృతిపట్ల పార్టీ నాయకులు పెంకి అప్పారావు, బివి.వర్మ, సూరిబాబు, ఐద్వా నాయకులు సందక ఉదయకుమారి, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దోకల కుటుంబానికి సానుభూతి తెలిపి అంతిమయాత్రలో పాల్గొన్నారు.



మహాలక్ష్మి(ఫైల్ ఫొటో)

గుండెపోటుతో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని కాశిపాడు విఆర్ఒగా పనిచేస్తున్న చంద్రశేఖర్(50) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. శేఖర్ పెంటపాడులో కాపురం ఉంటున్నారు. ఉదయం గుండెపోటు రావటంతో ఆయన కుటుంబ సభ్యులు రాజమండ్రి ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో షుగరు పెరిగి చనిపోయినట్లు విఆర్ఒ అసోషియేషన్ మండల అధ్యక్షులు కేశవ మూర్తి తెలిపారు. శేఖర్‌కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని సొంత ఊరు అయిన పెదనింద్రకొలను తీసుకుని వెళ్లినట్లు చెప్పారు. ఆయన కుటంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



చంద్రశేఖర్(ఫైల్)

ఎస్ఐ అశోక్ కుటుంబానికి ఆర్థిక సాయం

నరసాపురం : జూన్ 26వ తేదీన తెలంగాణలోని కోదాడ జిల్లా దుర్గాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆలమూరు ఎస్ఐ అశోక్ కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐలు రూ.26 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆంధ్ర, తెలంగాణలో వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఈ బ్యాచ్‌కు చెందిన 1100 మంది సిఐలు, ఎస్ఐలు ఈ మొత్తాన్ని సేకరించారు. ఆదివారం నరసాపురంలో జరిగిన అశోక్ సంతాప కార్యక్రమానికి హాజరై అశోక్ చిత్రపటానికి నివాళులర్పించి, ఎస్ఐ కుటుంబానికి రూ.26 లక్షలు అందించారు. పిల్లల చదువులకు తాము అండగా ఉంటామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. అంతేకాకుండా ఈ ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ జీవన్‌కు రూ.5 లక్షలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారులు శ్రీనివాస్, లతిఫ్, బి.యాదగిరి, రాజాలు పాల్గొన్నారు.

పలుచోట్ల ర్యాబిస్ నివారణా టీకాలు

ప్రజాశక్తి - నరసాపురం

జంతు ప్రేమికులు తమ పెంపుడు శునకాలకు తప్పనిసరిగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేయించి జంతు సంక్రమిత వ్యాధులను నివారించాలని పశు వైద్యశాల సహాయ సంచాలకులు(ఇన్‌ఛార్జి) ఇంజెటి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత ర్యాబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్వహించారు. సురేంద్రకుమార్ యాంటీ ర్యాబిస్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు జంతు సంక్రమిత వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. పెంపుడు జంతువుల ప్రేమికులందరూ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. 268 టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.పుష్ప ఏంజల్, వి.కాంచన, ఎన్.కృష్ణసాయి, కె.అంజి రెడ్డి, సిహెచ్.చందు కుమార్, ఎన్.అరుణ్ కుమార్, కె.దీపికా, షేక్ రహీమ్, కరీం, షరీఫ్, మస్తాన్, అరిఫా, బి.భార్గవి పాల్గొన్నారు.

భీమవరం టౌన్: శునకాల నుంచి మనుషులకు వ్యాపించే ర్యాబిస్ వ్యాధిని టీకాలతో అరికట్టవచ్చునని ప్రభుత్వ పశువుల ఆసుపత్రి ఉప సంచాలకులు డాక్టర్ సుధీర్ బాబు అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలోని ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ర్యాబిస్ వ్యాధి నివారణకు కుక్కలకు ఉచిత టీకాలను పంపిణీ చేశారు. సుధీర్ మాట్లాడుతూ ర్యాబిస్ ప్రాణాంతకమైన వ్యాధి అని, ఆ వ్యాధి కుక్కల నుంచి వ్యాపిస్తుందన్నారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ వ్యాధిని నివారించేందుకు ప్రతి కుక్కకు ర్యాబిస్ టీకాలను వేయించాలని, ప్రతి మూడు మాసాలు దాటిన కుక్కలకు ర్యాబిస్ నివారణ టీకాలు వేయించాలన్నారు. ఈ టీకా పశు వైద్యశాలలో ఉచితంగా వేస్తారని చెప్పారు. పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ జయకర్ జాన్సన్, డాక్టర్ పుండారి బాబు, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ లలిత, గో సంరక్షణ అధ్యక్షులు సుంకర దాసు పాల్గొన్నారు.



నరసాపురంలో..

ఉండి: పెంపుడు జంతువుల పట్ల ప్రేమతో పాటు అప్రమత్తత ఎంతైనా అవసరమని ఉండి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీదేవి అన్నారు. ఆదివారం ఉండి ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో నిర్వహించిన జూనోసిస్ డే సందర్భంగా పశువులకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ టి.శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ భాస్కర్, అంబులెన్స్ సిబ్బంది, పెంపుడు జంతువుల యజమానులు పాల్గొన్నారు.

శిక్షణ వృత్తి నైపుణ్యాన్ని పెంచుతుంది

ఉభయ గోదావరి జిల్లాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సూరంపూడి కామేష్

తణుకు : శిక్షణ వృత్తి నైపుణ్యాన్ని పెంచుతుందని ఉభయ గోదావరి జిల్లాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సూరంపూడి కామేష్ అన్నారు. ఆదివారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగాలకు మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూరంపూడి కామేష్ మాట్లాడుతూ దేశంలో న్యాయవ్యవస్థ అవసరం పెరిగిందన్నారు. ప్రజలకు అత్యున్నత న్యాయాన్ని అందించడంలో న్యాయ వ్యవస్థ ముందు భాగంలో ఉందని తెలిపారు. నేడు న్యాయవ్యవస్థలో పనిచేయుటకు న్యాయవాదులు వృత్తిని త్యాగంచేసి రావడం అభినందనీయమన్నారు. సత్వరమే ప్రజలకు న్యాయం అందాలంటే మండల స్థాయిలో కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆర్థికపరమైన లాభాల కోసం కాకుండా ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయ వ్యవస్థని తీర్చిదిద్దాలని, గ్రామస్థాయి వరకు న్యాయవ్యవస్థను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామన మునిస్వామి, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు కొండ శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - ఆచంట

అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆచంట వేమవరం గ్రామంలో జోరుగా సాగింది. ఈ కార్యక్రమంలో పితాని వెంకట్ ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ ప్రజల సమస్యలు ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మాజీ అధ్యక్షులు కేత మీరయ్య, స్థానిక నేతలు బికె.సత్యనారాయణ, గుడాల శ్రీనివాస్, సురేష్, సుబ్బారాయుడు, గుడాల నాగ సత్యనారాయణ, కనపాల వెంకటేశ్వరావు, యూత్ ప్రెసిడెంట్ గెద్దాడ దుర్గాప్రసాద్, టిడిపి ముఖ్య కార్యదర్శి గుడాల ఏడుకొండలు పాల్గొన్నారు.

తణుకు : గత వైసిపి ప్రభుత్వంలో మోసపూరిత సంక్షేమాన్ని అమలు చేశారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఏద్దేవా చేశారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం పాలూరు, కొమ్మర గ్రామాలతో పాటు తణుకు పట్టణంలోని 15, 16 వార్డుల్లో ఇంటింటికి పర్యటించి, ఏడాది కాలంగా అందుతున్న సంక్షేమ పథకాలతో పాటు జరుగుతున్న అభివృద్ధిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెట్టింపు సంక్షేమాన్ని అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. అనంతరం కొమ్మర గ్రామంలో మినీ గోకులం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకు: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

మొగల్తూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎపిఐసి ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు అన్నారు. మండలంలోని రామన్నపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజలు ఏమైనా సమస్యలను ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, మొగల్తూరు మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, కత్తిమండ ముత్యాలరావు, బొల్లా నారాయణ విఠల్, పాల రాంబాబు, నాగిడి రాంబాబు, డోల్లా రత్నంరాజు, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.